క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ



కేటీదొడ్డి: మండలంలోని పాగుంటలో మాజీ సర్పంచ్ గోవిందు మాతృమూర్తి లింగమ్మ, ఇర్కిచేడు బీజేపీ నాయకుడు లక్ష్మీరెడ్డి మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హన్మిరెడ్డి, సూర్యకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మల్దకల్: బైక్ అదుపుతప్పి కింద పడటంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. అమరవాయికి చెందిన బంగారు నర్సింహులు తన కుమార్తె గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను పరామర్శించి తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో గద్వాల మండలం పరమాల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పరిమితికి మించి నగదు తీసుకెళ్లొద్దు



అమరచింత: స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనల్లో భాగంగా పరిమితికి మించి నగదును తీసుకెళ్లొద్దని ఎస్‌ఐ స్వాతి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో నారాయణపేట జిల్లా సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.50 వేల కంటే అధికంగా ఉంటే వాటికి సంబంధించి వివరాలను తెలియజేయాలని సూచించారు. ఆధారాలు లేని పక్షంలో నగదును సీజ్ చేస్తామని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



ఆత్మకూర్: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోట్లంపల్లికి చెందిన 10 మంది పార్టీలో చేరారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐకి ప్రజల మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. అన్ని స్థానాల్లో పోటీచేసి గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యాక్రమంలో జిల్లా నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, రాబర్ట్, మోష, రాములు, బాలకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

ఆత్మకూర్: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బుధవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. కత్తేపల్లి గ్రామానికి చెందిన రమణ సెల్‌ఫోన్ సెప్టెంబర్ 29న చోరీకి గురైందన్నారు. కర్నూలులో ఫోన్ ట్రేస్ చేసి స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రజుమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వంట.. తంట



అమరవాయిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్(ఫైల్)

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందని బిల్లులు

- జూన్ నుంచి గుడ్ల బిల్లులు, రెండు నెలల వేతనాలు పెండింగ్
- భోజన తయారీకి తప్పని తిప్పలు

మానవపాడు: 'మధ్యాహ్న' భోజనం పథకం కింద పనిచేసే కార్మికులకు సకాలంలో బిల్లులు అందడం లేదని వాపోతున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుల ఊబిలో వెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు. గుడ్ల బిల్లులు జూన్ నెల నుంచి, మధ్యాహ్న భోజనం బిల్లులు రెండు నెలల నుంచి అందడం లేదని వాపోతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా

అలంపూర్ నియోజకగవర్గంలోని 7 మండలాల్లోని 226 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 29,265 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రతి రోజు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు దాదాపు 245 మంది నిర్వాహకులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి ప్రభుత్వం ప్రతినెల వేతనంగా రూ.3,000 చెల్లిస్తోంది. భోజనానికి అవసరమైన బిల్లులను తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విడుదల చేస్తోంది. ఇందులో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వారానికి మూడు కోడిగుడ్లు పెట్టాలి. అయితే.. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ. 5 చెల్లిస్తోంది. ప్రైవేటుగా రూ.7 పడుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. అదనంగా రూ. 2 భారం పడుతుందంటున్నారు. జూన్ నెల నుంచి నేటి వరకు ఆ గుడ్ల బిల్లులు పడటం లేదని పేర్కొంటున్నారు.

రూ.30 వేల వరకు భారం

ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైనాటి నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే అందిస్తోంది. మిగితా నిత్యావసరాలను భోజన నిర్వాహకులు తెచ్చుకోవాల్సిందే. వంద మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో రోజూ దాదాపు రూ. 750 నుంచి రూ. 1000 వరకు భారం పడుతుందంటున్నారు. అంటే ఒక నెలలో సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేలు వరకు భరించాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బకాయి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

గిట్టుబాట్టు కావడం లేదు



కూరగాయాలు, నిత్యావసరల ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే బిల్లులు మాత్రం పెంచడం లేదు. ఒక్కో కోడి గుడ్డు రూ.2 లు అదనంగా చెల్లించి విక్రయిస్తున్నాం. దీంతో అదనంగా మాపై భారం పడుతుంది. ప్రభుత్వం బిల్లులు కూడా సరిగా ఇస్తలేరు. ఇలాగైతే వంట చేసి పెట్టడం కష్టమే.

– జగ్గుల గిద్దమ్మ, పీఎస్ మానవపాడు

వేతనం పెంచాలి



మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికులకు ప్రతి నెలా రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లించాలి. క్రమం తప్పకుండా బిల్లులు విడుదల చేయాలి. రెండు నెలలుగా బిల్లులు రావడం లేదు. బిల్లులు తక్షణమే విడుదల చేయాలి. జూన్ నెల నుంచి గుడ్ల బిల్లులు కూడా అందడం లేదు.

– నాగేశ్వరమ్మ, చిన్నపోతులపాడు

నివేదికలు పంపాం

మధ్యాహ్న భోజన కార్మికులకు జూన్ నెల నుంచి గుడ్డు బిల్లు అందడం లేదు. గత రెండు నెలలుగా జీతాలు అందడం లేదని కార్మికులు మా దృష్టికి తీసుకొచ్చారు. నిర్వాహకులకు ఎవరికైతే మధ్యాహ్న భోజనానికి సంబంధించి బిల్లులు అందలేదో వారికి బిల్లులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, డీఈఓ

పారితోషికం ఇవ్వకుంటే విధుల బహిష్కరణ



మల్దకల్‌లో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు



మానవపాడులో ఎంపీడీఓ రాఘవకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

మల్దకల్: ప్రభుత్వం తక్షణమే పారితోషికం చెల్లించాలని, లేని పక్షంలో ఎన్నికల విధులు నిర్వహించే ప్రసక్తే లేదని సీపీఎస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు తమకు వెంటనే ప్రభుత్వం పారితోషికం చెల్లిస్తేనే ఎన్నికల విధులు నిర్వహిస్తామని లేని పక్షంలో విధులను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం విడుదల చేయాలి

మానవపాడు: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయుల, ఉద్యోగులకు పారితోషికం బకాయిలు వెంటనే విడుదల చేయాలని మండల కేంద్రంలో ఎంపీడీఓ రాఘవకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. విధులు నిర్వహించి ఏడాది కావస్తున్నా వేతనాలు మంజూరు చేయలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన పారితోషికాన్ని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమం ఎంఈఓ శివప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మౌలాలి, లక్ష్మన్న, భీసన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కల్వర్టు నిర్మించండి సారూ..

ఇటిక్యాల: మండల కేంద్రం శివారులో వాగుపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో నిత్యం అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. తేలికపాటి వర్షాలు కురిసినా కల్వర్టు నీటితో నిండుకుండలా మారడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కల్వర్టును నిర్మించాలని ఆయా గ్రాయాల వాహనదారులు కోరుతున్నారు.



ఇటిక్యాలలో పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టు ⟶

అధికారులు కలిసికట్టుగా పనిచేయాలి



మల్దకల్‌లో శిక్షణ ఇస్తున్న ట్రైనర్ వెంకటేష్

మల్దకల్/మానవపాడు/ఉండవెల్లి/ఇటిక్యాల: స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు కలిసికట్టుగా పని చేయాలని ఎన్నికల ట్రైనింగ్ అధికారి వెంకటేష్ అన్నారు. బుధవారం మల్దకల్‌లోని రైతువేదికలో పీఓలు, ఏపీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన ఎంపీటీసీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఐదు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ పత్రంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అభ్యర్థులతో చర్చించి పత్రాలను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంఈఓ సురేష్, ఎంపీఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్‌రెడ్డి, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

⇨ స్థానిక సంస్థల ఎన్నికల విధులను పోలింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రాఘవ అన్నారు. మానవపాడులో ఎంఈఓ శివప్రసాదు, మాస్టర్ ట్రైనర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

⇨ ఉండవెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఓలకు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ఎంపీడీఓ తిరుపతన్న లేటుగా రావడంతో ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభమైంది. నోడల్ అధికారి అక్బర్ సమావేశం పూర్తయిన అనంతరం రావడంతో ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు.



మానవపాడులో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు



ఉండవెల్లిలో..

⇨ ఇటిక్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్ అధికారి విష్ణు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. అధికారులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆకలి దినంగా పాటించాలి

అయిజ: అక్టోబర్ నెలలో చేపట్టిన 16 రోజుల కార్యక్రమాన్ని ప్రపంచ ఆహార దినోత్సవం కాదు ప్రపంచ ఆకలి దినంగా పాటించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ నరసింహులు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో 'ఆహార సార్వభౌమత్వం' కార్యక్రమంలో భాగంగా చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోఆర్డినేటర్ నరసింహులు మాట్లాడారు. వ్యవసాయ కూలీలను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, ఈజీఎస్ స్కీంలో వ్యక్తికి 200 పని దినాలను కేటాయించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రూ. 5 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రసూతి ప్రయోజనం కింద మహిళలకు ఐదు నెలలకు మొత్తం రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల సంఘం సభ్యులు నర్సమ్మ, సుశీలమ్మ, పద్మ, నవీన, తిమ్మప్ప, రాజారత్నం, కుబేర, వీరేష్, నరసింహులు, చంద్రకళ, గౌతమి పాల్గొన్నారు.



చైతన్యయాత్ర నిర్వహిస్తున్న వ్యవసాయ వృత్తిదారుల సంఘం సభ్యులు

'కృషివాస్'తో అధిక దిగుబడి

ఉండవెల్లి: కృషివాస్ యాప్ వినియోగం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని పాలెం శాస్త్రవేత్తలు అన్నారు. మండల కేంద్రంలోని మనోరమాదేవి కల్యాణ మండపంలో రైతులకు క్రిషివాస్ యాప్‌పై అవగాహన కల్పించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా కృషివాస్ యాప్ ద్వారా శాటిలైట్ ద్వారా పంటలో రోగ నిర్ధారణ, కూలీల కొరత నివారణ, అధిక దిగుబడికి మార్గం ఉంటుందని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేతలు డా. విష్ణువర్ధన్ రెడ్డి, డా.నరసింహారెడ్డి, డా.శంకర్, డా.సంధ్య అన్నారు. అనంతరం కీ.శే పాడువు శ్రీరామ్‌రెడ్డి జ్ఞాపకార్థం కుమారులు రాంభూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌బీ ఫౌండేషన్, గొరెంటాల ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. లింగారెడ్డి, నారాయణరెడ్డి, సందీప్, వర్షా, సుచరిత, లహరి, భార్గవి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేతలు

డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు



అయిజ: మండలంలోని పోలోని వాగువద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పక్కన కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డుకు మండలంలోని పులికల్‌కు చెందిన రామాంజనేయులు సొంత ఖర్చులతో మరమ్మతు చేయించారు. పొక్లెయిన్ యంత్రంతో మట్టిని వేయించారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటడంతో రోడ్డుకు మరమ్మతు చేయించనట్లు రామాంజనేయులు తెలిపారు.

వ్యర్థాల తరలింపుపై కేసు నమోదు

అలంపూర్: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రవి, మంజునాథ్ నాయుడు వాహన తనిఖీలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు నుంచి బొలెరో వాహనంలో కుళ్లిన కోళ్ల వ్యర్థాలను గుర్తించినట్లు తెలిపారు. వ్యర్థాలను తరలించేందుకు అనుమతులు లేకపోవడంతో వ్యర్థాలను తరలిస్తున్న దిన్నేదేవరపాడుకు చెందిన డ్రైవర్ శివ, వాహన యజమాని ఉపేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుంతల రోడ్డు.. ఆపై మురుగు



నందిన్నెలో గుంతలమయమైన రోడ్డుపై నిలిచిన మురుగు

కేటీదొడ్డి: మండంలోని నందిన్నెలో ప్రధాన రోడ్డుపై మురుగు పారుతుండటంతో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. నందిన్నె నుంచి కుచినెర్లకు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడి మురుగు నిల్వ ఉంటున్నట్లు పేర్కొంటున్నారు. రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిల్వ ఉంటడంతో దోమలకు ఆవాసాలుగా మారాయని, దుర్వాసన వస్తుండటంతో పాటు రోగాల బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు. మురుగు విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.


రహదారికి మరమ్మతు చేపట్టరూ..

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికల్– ఆత్మకూర్ ప్రధాన బీటీ రహదారి కొత్త పెట్రోల్ బంక్ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టకముందే రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించడంతో రహదారి పూర్తిగా ఇరుకుగా తయారైందన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలమయమైన రహదారి

శివారుల్లో అంధకారం



నందిన్నె శివారు గద్వాల ప్రధాన రహదారిలో కారుచీకటి

- వెలగని వీధిలైట్లు
- నిత్యం ప్రమాదాలు, చోరీలు
- పట్టించుకోని అధికారులు

కేటీదొడ్డి: మండల కేంద్రంతోపాటు గ్రామాల శివారు ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయి. మండలంలోని మేజర్‌పంచాయతీతో పాటు గ్రామాల అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారులు, వీధుల వెంట అమర్చిన ఎల్‌ఈడీ లైట్లు పనిచేయకపోగా వాటి మరమ్మతు గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కొత్త విద్యుత్ దీపాల ఏర్పాటు, మరమ్మతు జీపీలు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రమాదాల బారిన

మండల కేంద్రంలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను అలంకార ప్రాయంగా ఏర్పాటు చేశారు. గ్రామాల శివారు ప్రాంతాలు చీకట్లోనే ఉంటున్నాయి. వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లోనే వాహనదారులు రాకపోకలు సాగించడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. అదే విధంగా గ్రామ శివారు ప్రాంతాల్లో చీకట్లు అలుముకున్న నేపథ్యంలో మద్యం తాగడం, ఇతర అసాంఘీక కార్యక్రమాలకు అడ్డగా మారింది. రోడ్ల వెంట వెళ్తున్న మహిళలపై దురుసుగా ప్రవర్తించడం, లైంగిక దాడులకు పాల్పడడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



కేటీదొడ్డిలో వెలుగని వీధిలైట్లు

మండల పరిధిలో

మండలంలోని కొండాపురం, నందిన్నె, ఇర్కిచేడు, మల్లాపురం, పాతపాలెం, గువ్వలదిన్నె తదితర గ్రామాల్లో వీధిలైట్ల సమస్య తీవ్రతరంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా మండల కేంద్ర శివారులో తరచూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

నిధులు కేటాయించాలి

మండల కేంద్ర శివారులో వీధిలైట్లు లేక అంధకారం నెలకొంది. చీకట్లో రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు దొంగ తనాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వైధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– మైబు, కేటీదొడ్డి

పంచాయతీలపై భారం

వీధిలైట్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో గ్రామ పంచాయతీపైనే భారం పడుతుంది. కొద్దిపాటి ఆదాయంతో ఇతర ఖర్చులకే ఇబ్బంది తలెత్తుతుంది. జీపీ నుంచి కొత్తగా వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నాం.

– రమణారావు, ఎంపీడీఓ

రూ.లక్షల్లో భారం

గ్రామ పంచాయతీలపై విద్యుద్దీపాల నిర్వహణకు రూ.లక్షల్లో నిధులు కేటాయించాల్సిన వస్తోంది. ప్రభుత్వం ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆ భారం జీపీలపై పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సిబ్బంది జీతాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు, ట్రాక్టర్ల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండగా మరోవైపు ఇందుకు రెట్టింపు స్థాయిలో విద్యుద్దీపాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. మండల పరిధిలో వీధిలైట్ల నిర్వహణకు రూ.6.60 లక్షల వరకు నిధులు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. మేజర్ పంచాయతీలకు రూ.30 వేలు, గ్రామాలకు రూ.20 వేల వరకు వీధిలైట్ల నిర్వహణకు జీపీల పైనే భారం పడుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా మేజర్ గ్రామ పంచాయతీలు, శివారు ప్రాంతాలతో పాటు మరమ్మతుకు ఉన్న ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లను ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది.